# హాళ్ళకి హాళ్ళ

శారద కూర తరుగుతోంది. ఎదురుగా బిక్కమొహం వేసుకొని కూచున్నాడు కొడుకు రమేష్. పక్కన కూతురు శాంతి మూతి ముడుచుకొని కూచుంది. రెండురోజుల్లో రాబోయే పుట్టినరోజునాడు స్కూల్లో ఒక్కొక్కళ్లకి రెండేసి చాక్లెట్లు పంచిపెడతానని అడిగేడు రమేష్. ఒక్కొక్కటే పంచి పెట్టమని చెప్పింది. శారద. చిన్నపిల్లాడి కది క్లాసులో తలవంపు తెస్తుందనిపించింది. ఎలాగయినా అమ్మని ఒప్పించాలని చూస్తున్నాడు.

"మొన్ననే రాజా పుట్టినరోజుకి రెండేసి పంచిపెట్టేడమ్మా!"

"ఎవరికి వీలయినట్లు వాళ్లు చేసుకుంటారు, రమేష్! అప్పటికీ నువ్వడిగేవని పాంటు కుట్టించేను గదా. మామూలుగా నిక్కరే అనుకున్నాను. ప్రక్కవాళ్లకున్న ప్రతిదీ మనకెలా వస్తుంది? మనతాహతుకు తగ్గట్లుగా మనముండాలి."

"ఏదడిగినా అలాగే అంటావు. వాళ్లనాన్నా ఇంజనీరే, మననాన్నా ఇంజనీరే"

"వాళ్ల నాన్నకి గవర్నమెంటులో పని. మీ నాన్నకి ప్రైవేటు కంపెనీలోపని. ఇంజనీర్లందరికీ జీతాలొక్కటే ఉండవు." మెల్లగా నచ్చచెప్పింది శారద. పుట్టినరోజున కొడుకు ఆనందంగా ఉండాలనే ఏ తల్లైనా కోరుకుంటుంది. అలాగని, తాహతుకి మించిన కోరికలు తీర్చలేదు కదా.

"అమ్మంతేరా, అన్నయ్యా! ఏ వడిగినా లేదంటుంది. మా స్కూల్లో ఆయా కూతురు నా కన్నా మంచి బట్టలు వేసుకుంటుంది. నేనడిగితే అమ్మ మొన్ననేగా కొనుక్కున్నావ్ అంటుంది"

శారదలో సహనం చచ్చిపోయింది.

"అయితే, నన్ను కూడా ఆయాపని చేయమంటావా?"

పరిస్థితి విషమిస్తోందని గ్రహించిన సీతారాం పిల్లలిద్దరినీ దగ్గరగా పిలిచేడు.

"శాంతీ! మొన్న టెస్టులో నీకేం ర్యాంకు వచ్చిందమ్మా!"

"ఫస్టు ర్యాంకు."

"ఆయా కూతురి కేం రాంకు వచ్చింది?"

శాంతి మాట్లాడలేదు కానీ, ఆ అమ్మాయికి డాడీ ఏంచెప్తున్నాడో తెలిసింది.

"రమేష్! మీ స్కూల్లో డిబేట్సులో, ఆటల్లో నీ కెన్ని ప్రైజులొచ్చాయి. రాజాకెన్ని వచ్చాయి? పిల్లలూ! మనము పోల్చుకోవల్సిన వాటిలోనే పోల్చుకోవాలి. క్లాసులో ఎన్ని చాక్లెట్లు పంచేమన్నది కాదు ముఖ్యం. అసలు చాక్లెట్లే పంచిపెట్టని వాళ్లుకూడా ఉన్నారు కదా!" మెల్లిగా ఇద్దరికీ అర్థమయ్యేలా చెప్పేడు.

పిల్లలిద్దరూ వాళ్లమ్మదగ్గరికి వచ్చి - "సారీ మమ్మీ!" అన్నారు.

ఆ రాత్రి శారదపుస్తకంలో ఆ రోజు ఖర్చులు రాసి నెలకైన మొత్తం ఖర్చు కూడివేసింది. ఆమె ఎం.కాం. చదివింది. తన అకౌంటన్సీ అంతా ఇంటి జమా ఖర్చుకి తప్ప, ఎందుకూ పనికిరావడం లేదన్న అసంతృప్తి ఉంది. తనుకూడా ఉద్యోగం చేస్తుంటే సాయంత్రం సంఘటనలాంటివి జరగవని ఆమె ఉద్దేశ్యం. వేన్నీళ్లకు చన్నీళ్లలా తనుకూడా సంపాదిస్తూ ఉంటే, పిల్లలకి అడిగినవి కొనివ్వచ్చు, కొంత వెనకేసుకోవచ్చు, భర్తది ప్రైవేటు కంపెనీలో నెలకి రెండువేల అయిదువందల రూపాయల ఉద్యోగం. పెరిగే ధరల్లో, పిల్లల చదువులతో రోజు గడవడం చాలా కష్టంగా ఉంది. పిల్లలు కూడా ఇప్పుడు పెద్దవాళ్లయ్యేరు.

భర్త పక్కన పడుకొని మెల్లిగా - "ఏమండీ!" అని పిలిచింది శారద.

ఉలిక్కిపడ్డాడు సీతారం. అంత గోముగా పిలుస్తోందంటే ఏదో అడగడానికే అని అతడి ఉద్దేశ్యం. అడిగే కోరికలేముంటాయి? జీతం, బోనస్ - అన్నీ భార్య చేతిలోనే పెడుతున్నాడు. శారద కూడా చాలా జాగ్రత్తకల మనిషి, డబ్బు చాలా పొదుపుగా వాడుతుంది. కోరరానివేవీ కోరదులే అనుకున్నాడు.

"ఏం, శారదా!"

"నేనేదైనా ఉద్యోగం చేస్తానండీ!"

"నువ్వా!"

"ఏం, నేను చెయ్యకూడదా? ఎం.కాం. ఫస్టుక్లాసులో పాసయ్యాను. చిన్నప్పుడే పెళ్లి చేసేశారు. లేకపోతే ఏ బ్యాంకు మేనేజరునో అయి ఉండేదాన్ని."

"నిజమేననుకో. అయినా, ఇప్పుడు పిల్లలతో చెయ్యడం కష్టంకదా!"

"ఇప్పుడేముంది కష్టం! పిల్లలిద్దరూ స్కూలికి వెళ్లి వస్తున్నారు. ఇంట్లో నాకూ పొద్దు పోవడం లేదు. ఎంత ప్రయత్నించినా నెలకి రెండు వందలకన్నా మిగల్చలేకపోతున్నాం. మీదా ప్రైవేటుకంపెనీ, పెన్షన్ రాదు. నేను సంపాదించింది దాచుకుందాం. మీ జీతం ఖర్చు పెట్టుకుందాం. పిల్లలకి అన్నీ కాదనడం ఎంత కష్టంగా ఉందో మీకు తెలుసా? ఏమంటారు?"

"పిల్లలకు మెల్లిగా సర్దిచెప్తే వింటారు శారదా. ఇక రిటైర్ అయ్యేక అంటావా - పెన్షన్ రాకపోయినా పి.ఎఫ్., గ్రాట్యూటీ అవీ ఉంటాయి కదా!".

"మీరలాగే అంటారు. మీరు సంపాదిస్తే హాయిగా తిని కూచుంటున్నానంటున్నా రంతాను. గ్యాస్, కుక్కర్, మిక్సీ ఉన్నాయి. పనిమనిషుంది. పిల్లలు పెద్దయ్యారు. ఇంక ఉద్యోగం చెయ్యటంలో నాకేమిటి కష్టం?"

సీతారాంకి శారద బాధ అర్థమైంది. ఎం.కాం. సెకండ్ఇయర్‌లో ఉండగానే తమ పెళ్లయింది. ఆ తరువాత ఏడాదికే కొడుకు పుట్టాడు. మరో రెండేళ్లకి కూతురు పుట్టడం, వాళ్లిద్దర్నీ పెంచడంతోటే శారదకు గడిచిపోయింది. తన చదువంతా వృథా అయిపోయిందని భార్యకు అసంతృప్తి. గృహ నిర్వహణలో తమ పిల్లల పెంపకంలో, తనకు అవసరమైనపుడు అండగా నిలవడంలో ఆమె తెలివితేటలు ఎంతో ఉపయోగపడుతున్నాయని అతననుకుంటాడు. ఇప్పుడు కాదు, ఉద్యోగం వద్దన్న విషయం మెల్లిగా నచ్చచెప్పాలి. "అలాగే, చూద్దాం."

రాజకీయనాయకుల్లాగే చూద్దాం అంటే వాయిదా వెయ్యడమని అతని ఉద్దేశ్యం. "అలాగే, చూద్దాం"లో అలాగే అన్నమాటను మాత్రమే తీసుకొని, భర్త అంగీకరించాడని తృప్తిగా నిద్రపోయింది శారద.

❖ ❖ ❖

నెలరోజుల తరువాత సాయంత్రం ఇంటికి వచ్చిన సీతారాంకి స్వీటు పెట్టిన ప్లేటుతో ఎదురైంది శారద.

"ఏమండీ, మీకో శుభవార్త!"

"అదేమిటి, ఆపరేషన్ అయిపోయి నాలుగేళ్లు అయిందిగా, ఇప్పుడు శుభవార్తేమిటి?"

కోపమూ, సిగ్గూ కలిపి ప్రదర్శించింది శారద.

"అబ్బ! మీ మగవాళ్లకి భార్యలనుండి వేరే శుభవార్తలుండవా?"

"స్వీటు బాగుందోయ్, సరే శుభవార్తేమిటో చెప్పు."

కాగితం అతనిచేతిలో పెట్టింది. కొత్త గ్రహారంలోని చార్టెడ్ అకౌంటెంట్స్ కంపెనీ ఒకటి శారదకు అసిస్టెంటుగా అపాయింట్‌మెంట్ ఇచ్చినట్లుంది అందులో.

దిగ్భ్రాంతితో చూశాడు భార్యవైపు.

"రమేష్ పుట్టినరోజు ముందు అడిగేనుగా ఈ విషయం. మీరు అలాగేనన్నారు. మర్నాటి నుంచి ప్రయత్నం చేశాను. ఎక్కడ నా ప్రయత్నం విఫలం అవుతుందోనన్న భయంతోటీ, మీకు సర్ప్రయిజ్‌గా చెప్దామన్న ఆశతోటీ ముందు చెప్పలేదు. ఈ రోజు ఆర్డరే చూపిస్తున్నాను. నెలకు పదిహేను వందలు. ఆశ్చర్యంగా ఉంది కదూ!"

"ఆఫీసు ఎన్నిగంటలకు"

"ప్రొద్దుట తొమ్మిది నుంచి నాలుగున్నరదాకా. మీకు ఈ కంపెనీ గురించి తెలుసేమోకదా."

చాలా కంపెనీలకి ఆడిటర్స్ వాళ్లు. పెద్ద కంపెనీయే. పనిచేయించుకొని జీతం ఎగ్గొట్టే బాపతుకాదు. అంతవరకూ నయమే అనుకున్నాడు సీతారాం.

"మరి పిల్లలసంగతి"

"పిల్లలెలాగూ ఎనిమిదిన్నరకే వెళ్లిపోతారు కదా. సాయంత్రం నేను వచ్చేవరకూ పక్కింటి పిన్నిగారు చూస్తానన్నారు. చూడ్డానికేముంది, వరండాలో కూర్చుని హోంవర్కు చేసుకుంటారు. పాలు ఫ్లాస్కులోపోసి పక్కింట్లో ఉంచుతాను. రాగానే తాగుతారు. బాత్రూం ఎలాగూ బయటే ఉందికదా."

"ప్రొద్దుట అన్ని పనులూ పూర్తిచేసుకోగలవా?"

"ఎలాగూ పిల్లలకీ, మీకూ ఆటైంకే వంటా, టిఫినూ అయిపోతున్నాయిగా. ఇంత కష్టమేమిటి? పనిమనిషిని ప్రొద్దుటే అన్ని పనులూ చేసేయమన్నాను."

"మరి ఆఫీసు దూరమేమో కదా, వెళ్ల రావడమెలా?"

"దానికేముంది ప్రొద్దున రిక్షాలో వెడతాను. నెలకి నూటయాభైకి మాట్లాడేను. సాయంత్రం మీరు ఫ్యాక్టరీ నుండి వస్తూ తీసుకొద్దురు గానీ".

అయిష్టంగా మొహం పెట్టాడతను

"ఉద్యోగం నేను చేస్తున్నానని, మీ చేతేమీ వంటవనీ, ఇంటివనీ చేయించనులెండి. సాయంత్రం కూడా రిక్షా అంటే ఇంకో నూటయాభై. మీ ఫ్యాక్టరీ నాలుగు గంటలకే అయిపోతుందిగా. మా ఆఫీసుకి రండి. ఇద్దరం కలిసి ఇంటికి వచ్చేద్దాం."

అన్నీ నిర్ణయించుకున్నట్లే ఉంది శారద. ఇప్పుడు తనుకాదన్నా ప్రయోజనం లేదు. ఈ దేశంలో చీఫ్‌జస్టిస్‌కే మాట్లాడ్డానికి లేదు. తనెంత? భార్య అభివృద్ధికి అడ్డంకి అయ్యేడన్న చెడ్డపేరు రావడం అతనికిష్టం లేదు.

"అలాగే, నీ ఇష్టమే కానియ్యి"

"అంటే మీకిష్టం లేదా?"

"శారదా! అర్థాలు తీయకు. లోపలకుపద. కొంచెం కాఫీ ఇయ్యి"

❖ ❖ ❖

శారదకు ఎంతో ఆనందంగా ఉంది. ఆరోజే ఆమె డ్యూటీలో చేరబోతోంది. వంటా, టిఫినూ ఎలాగూ తొందరగానే అయిపోతాయి. ఇంకేమిటి కష్టం? వచ్చే పదిహేనువందలలో రిక్షాలకూ, సాదరు ఖర్చుకీ, పిల్లల సరదాకీ అయిదు వందలవుతాయి. నెలకి వెయ్యి రూపాయలదాకా మిగులుతాయి. తమ కుటుంబ ఆదాయానికి ఇన్నాళ్లకు తను తోడ్పడగలుగుతోంది. ఇంక సంఘంలో తనకూ గౌరవం ఎంతో లభిస్తుంది. ఆమెకు గాలిలో తేలిపోయినట్లుగా ఉంది. హడావుడిగా ఇంటికి తాళం వేసి, రిక్షా ఎక్కింది.

రోజులామెకు హాయిగా గడిచిపోతున్నాయి.

ఫస్టుతారీకు వచ్చింది. ఆఫీసులో అంతా ఆమెచుట్టూ గుమిగూడేరు. "మేడం! మొదటి జీతం తీసుకోబోతున్నారు, మాకు పార్టీ ఇవ్వాలి."

"అలాగే, తప్పకుండా".

వాళ్లలో చొరవ ఉన్నవాడు వెంటనే ప్యూన్‌ని పిలిచి ఆర్డర్ ఇచ్చాడు. ప్యూన్ వెళ్లి అందరికీ సమోసాలూ, స్వీటూ, కారబ్బూందీ, కేకులూ పట్టించుకొచ్చాడు. బిల్లు చూసిన శారద అవాక్కయింది. "పోనీలే, ఈ ఖర్చు అస్తమానం ఉండదు కదా. ఈ ఒక్కసారే" అనుకుంటూ - రెండు వందరూపాయలనోట్లు తీసి ఇచ్చింది.

శారద పక్కసీటులో కూర్చున జానకి మెల్లిగా అంది.

"శారదగారూ! మీరేమనుకోరంటే చిన్నమాట చెప్తాను."

"ఏమిటి, చెప్పండి"

"ఏం లేదు, మీరేం అనుకోనంటేనే చెప్తాను. మీరు బొత్తిగా పది, పన్నెండు చీరలతోటే మేనేజ్ చేస్తున్నట్లున్నారు.

జాబ్ చేస్తున్నాం కదా. కట్టుకున్న చీర మళ్లీ. మళ్లీ కట్టుకోవడం అంటే నలుగురిలోనూ మనలేడీస్‌కి తీసేసినట్లుగా ఉంటుంది. మన భర్తల్ని కూడా కర్కోటకులనీ, భార్య జీతమంతా లాగేసుకుంటారనీ అంచనా వేస్తారంతాను."

తన భర్త అయిదారు జతల బట్టలతోనే మేనేజ్ చేస్తున్నాడే. తనకీ అంతే చాలనుకొంది. ఆ మాట ఊహించి నట్లుగా అంది జానకి.

"మగవాళ్లేం కట్టుకున్నా ఎవరూ పట్టించుకోరు. మన ఆడవాళ్లకి అలా కాదు కదా. చేరిన కొత్తలో నన్నంతా పచ్చపట్టుచీర అనేవారు. ఏ ఫంక్షన్ అయినా అదేచీర - నా పెళ్లిది లెండి - కట్టుకునేదాన్ని, మెల్లిమెల్లిగా కొనుక్కున్నాను."

"అన్ని చీరలొక్కసారి కొనుక్కోలేం కదా!"

"దానికేముంది. ఈ రోజు ఫస్టుకదా - చీరలమ్మే అతను వస్తాడు. మీరు ఓ నాలుగైదు తీసుకోండి. డబ్బంతా ఇప్పుడే ఇవ్వనక్కర్లేదు. మెల్లిగా వాయిదాల్లో ఇవ్వచ్చు."

అప్పచేసి పప్పకూడా అనుకుంది శారద. కానీ, ఏం చేయాలి. ఒకేసారి షాపులో కొనుక్కోలేదు కదా. అస్తమానం ఏం కొనుక్కోదు కదా. ఇప్పటికిలాగే తీసుకుందాం అనుకుంది. చీరల వాడిదగ్గర ఐదు చీరలు తీసుకుంది. నెలకి నూటిరవై చొప్పున పది నెలలు కట్టాలి.

ఇంటికొచ్చేసరికి పిల్లలు బిక్కమొహాలతో కూర్చున్నారు. ఏమైంది అంది శారద.
"పాలు విరిగి పోయాయి. మమ్మీ!"

పర్సులోంచి పదిరూపాయలు తీసి ఇచ్చింది. షాపులోనుంచి ఏదైనా తెచ్చుకొని తినండి అంది.

"అమ్మగారూ! ఈ నెలనుంచి ఇరవై పెంచడమ్మా!"

"అదేమిటి, మొన్న నెలేగా పెంచాను."

"ఇదివరకైతే తమరింట్లో ఉండేవారు. ఎప్పుడొచ్చినా సరిపోయేది. ఇప్పుడంత పనీ పొద్దుటే కావాలంటున్నారు. మిగతా ఇళ్లలో దెబ్బలాడుతున్నారు. ఆలస్యం చేస్తున్నానని, ఇంకో ఇల్లైనా మానేయాలి. మీ ఇంటికి అంట్లు తోమడానికోసారీ, బట్టలుతకడానికోసారీ వస్తే మీరైనా ఊరుకోవాలి."

ఇరవై పెంచడానికి ఒప్పుకుంది శారద.

"శారద! బీరువాలోనుంచి యాభై తీసియ్యి. ఈవేళ పెట్రోలు పోయించాలి."

సీతారాంకి స్వయంగా డబ్బు తీసుకోవడం అలవాటు లేదు. శారదే డబ్బు తీసిచ్చి, ఖర్చులపుస్తకంలో రాసుకుంటుంది.

"మొన్ననేగా పోయించారు"

"నిన్ను తీసుకొస్తున్నానుగా, దూరమెక్కువ అవుతోంది."

ఈ చిన్న ఖర్చులెన్నయినా నెలకి ఏడెనిమిది వందలైనా మిగలకపోవు అనుకుంది శారద.

పండక్కి వచ్చిన సీతారాం చెల్లెలు - "వదినా! ఇదివరకే చీరపెట్టినా తీసుకునేదాన్ని, అన్నయ్య రెక్కలకష్టం మీదే ఇల్లంతా గడవాలప్పుడు. ఇప్పుడు అలా కుదరదు. నాకు మంచి చీరపెట్టాలమ్మాయ్!" అంది. హాస్యానికే అందేమో కానీ, శారద సీరియస్‌గానే తీసుకుంది. అలాగే తనకి ఇంకో ఆరుచీరలు తీసుకుంది. నెలకి కట్టే డబ్బు నాలుగు వందలకు పెరిగింది.

"అమ్మాయ్, శారదా! కాఫీ పొడి అయిపోయింది. ఈ చిన్నగిన్నెతో కాస్త ఇయ్యమ్మా, అనుకోకుండా చుట్టాలొచ్చారు. సాయంత్రం అబ్బాయిరాగానే తెప్పించి ఇస్తా."

చిన్న గిన్నె ఏమిటి పావుకిలోకి తక్కువ పట్టదు. ఇదివరలో పంచదార ఓసారి పట్టుకెళ్లింది. కందిపప్పొకసారి, సబ్బు పొడోసారి. మిగతావి గుర్తుకు రావడంలేదు కూడాను. ముందైతే ధైర్యంగా అయ్యో, మా ఇంట్లోనూ అయిపోయిందండి" అనేసేది. ఆవిడకు తిరిగి ఇచ్చే అలవాటు లేదని తెలుసు. కానీ, ఇప్పుడలా అనడానికి లేదు. సాయంత్రం పిల్లలు వాళ్ల వరండాలోనే కూర్చుంటున్నారు. ఈవిడ నెలకి వందరూపాయలకైనా తిరిగి ఇవ్వని అరువు పెడుతోంది. గట్టిగా కాదనడానికి లేదు. ఈ ఖర్చుని బేబీ సిట్టింగు చార్జీ అని రాసుకోవాలా? ఇంతకీ ఈవిడ చేస్తున్నదేమీ లేదుకూడానూ. పిల్లలు వాళ్లంతట వాళ్లే ఫ్లాస్కు తీసుకుని  పాలు తాగుతున్నారు. ఇదివరకు తను జంతికలూ, కజ్జికాయలూ - ఏవో ఒకటి చేసి ఉంచేది. ఇప్పుడు తీరిక లేదు. సాయంత్రం వస్తూ బిస్కట్ పాకెట్టో, ఓ పావుకిలో స్వీట్సో, మిక్సరో కొనుక్కొస్తోంది. అప్పటిదాకా పిల్లలు ఆకలితో అవురావురు మంటూనే ఉంటున్నారు. వాళ్లని చూస్తే అప్పుడప్పుడు జాలి వేసినా, "వీళ్లకోసమేగా తనింత కష్టపడి ఉద్యోగం చేస్తోంది. ఇంటా, బయటా చాకిరీ వీళ్ల భవిష్యత్తుకేగా" అనుకునేది శారద.

❖ ❖ ❖

పనిమనిషి ఇంకో పదిరూపాయలు జీతం ఎక్కువ చేసింది. పిన్నిగారు అరువు పట్టుకెడుతూనే ఉంది.

సాయంత్రం పిల్లలు బిక్కమొహాలేసుకొని కూచున్నారు.

"ఏమిట్రా, ఏమైంది?"

"నువ్వు చూపించు అన్నయ్యా"

"నువ్వు ముందర చూపించు, చెల్లీ!"

ఏమిటి చూపించాల్సింది అని అడిగింది శారద. పిల్ల లిద్దరూ ప్రోగ్రెస్ కార్డులు చూపించారు. రాంకులు బాగా పడిపోయాయి. లెక్కల్లో అయితే ఫెయిల్ మార్కులే వచ్చాయి. ఇదివరకిద్దరూ పోటీ పడి నేను ఫస్టంటే, నేను ఫస్టని చూపించేవారు.

"ఏమిటి, ఇలా వచ్చాయి మార్కులు, ఇద్దరూ లెక్కల్లో ఫెయిలయ్యారేమిటి?"

"లెక్కలు చాలా కష్టంగా ఉన్నాయి, మమ్మీ! నిన్నడిగితే ఇప్పుడు వంట చేస్తున్నా టైం లేదని అంటున్నావు. మేమే చేసుకుంటే చాలా డౌట్స్ ఉండిపోతున్నాయి. మా టీచర్‌నడిగితే అన్నీ క్లాసులో చెప్పలేం. ట్యూషన్ పెట్టుకో అన్నారు."

నిజమే! సాయంత్రం తనకి తీరికుండడం లేదు. వీళ్ల చదువులు పాడవకూడదు. ట్యూషన్ పెడితే సరి. ట్యూషన్ టీచర్ దగ్గరకు తీసుకెళ్లింది పిల్లలిద్దర్నీ. ఇద్దరికీ చెరోవందా అడిగింది టీచర్. పిల్లలకోసమేగా తను కష్టపడి సంపాదించేది వాళ్లకోసం కాకపోతే ఇంకెవరికోసం ఖర్చు పెడతాం అనుకుంది శారద. సాయంత్రం అయిదు నుంచి ఆరుదాకా చెప్పడానికి రెండు వందలిచ్చింది.

❖ ❖ ❖

కిరాణా షాపునుంచి తేవాల్సిన సామన్ల జాబితా చూస్తూ అడిగాడు సీతారాం - "అదేమిటి పంచదార, నూనె ఇవ్వలేదా రేషన్‌లో. ఇక్కడ రాశావేమిటి?"

"ఓ సారి వెడితే లేదన్నాడు. మళ్లీ వెళ్లడానికి టైం దొరకలేదు."

"బయట నూనె ముప్పై అయిదు."

"ఏం చేస్తాం, పట్రండి".

❖ ❖ ❖

ఆఫీసులో ఫైలు రాస్తున్న శారద ముందు కూర్చుని - "మేడమ్! మన శంకర్రావు పెళ్లి శుభలేఖ ఇచ్చాడు కదా అంతా కలిసి గిఫ్ట్ కొందామనుకుంటున్నాం. మీ కంట్రిబ్యూషన్ ఎంతో చెప్తే...." అన్నాడు కొలీగ్ శేఖర్.

"ప్రతి నెలా ఎవరిదో ఒకళ్లది పెళ్లి లేకపోతే ఎవరో ఒక ఒకరింట్లో పుట్టినరోజు, లేకపోతే ఆఫీసులో వినాయక చవితి - దేనికో దానికి అడుగుతూనే ఉన్నారు. కొంతమంది సోషల్ వర్కు అంటూ చందాలు. ఏరాయైతేనేం...." అనుకుంది శారద.

"మేడమ్! యాభై రాస్తాను".

"యాభయ్యా!"

"అదేమిటి, మేం మగవాళ్లం - ఒక్క జీతాల వాళ్లం ఇస్తున్నాము. మీ కేమిటి ఇంటి ఖర్చు అంతా ఆయనదే కదా. ఫిఫ్టీ రుపీస్ రాస్తున్నా" అంటూ వెళ్లిపోయాడు.

ఈ సోషల్ అబ్లిగేషన్స్ తప్పవు. ఇంటికొచ్చే చందాల వాళ్లు కూడా ఎక్కువే అడుగుతున్నారు. కాలనీలో ఏ ఫంక్షనైనా, చుట్టాలిళ్లల్లో అయినా ఇది వరకులా ఇస్తే "ఇంతేనా" అన్నట్లుగా మొహాలు పెడుతున్నారు.

❖ ❖ ❖

ఆరు నెలల తరువాత ఖర్చుల పుస్తకం, బ్యాంకు పాసుబుక్కు పక్క పక్కన పెట్టుకుని కూచుంది శారద. భర్త మాత్రమే సంపాదించే రోజుల్లో నెలకి రెండువందలైనా మిగిలేవి. తన పదిహేనువందల్లో కనీసం వెయ్యి రూపాయలైనా మిగులుతాయనుకుంది. ఇదివరకటి రెండు వందలుకూడా లేవేమిటీ? కుటుంబ ఆదాయానికి తను చేసిన కృషి ఏమైంది? ఎమ్.కామ్.పాసయిన శారదకు అయోమయంగా అనిపించింది. ఆ మాటే అంది సీతారాంతో.

"ఎకనమిక్స్ చదివేవు. డిక్రీజింగ్ రిటర్న్ అంటే తెలీదా? ఒక స్థాయినే మన కృషి ఫలితాన్నిస్తుంది. అపైన చేసిన కృషి వల్ల కలిగే ఫలితం తగ్గుతూనే ఉంటుంది. ఆ సంగతి నీకూ తెలుసు కదా. ఒకళ్లు ఉద్యోగం చేస్తే వచ్చిందానికి ఇద్దరు ఉద్యోగం చేస్తే వచ్చేది రెట్టింపు కాదు. పై పెచ్చు ముందు కన్నా తగ్గవచ్చు కూడా".

"అయితే, నా ఉద్యోగం దండగేనా? మన కుటుంబం ఆదాయం నావల్ల ఎక్కువవుతుందనుకున్నాను. తగ్గిపోయింది."

"దండగని ఎందు కనుకుంటావు? నువ్వు ఎమ్.కామ్. చదివేవు. నీ చదువు దేశానికి వ్యర్థం కాకుండా ఒక అకౌంటింగ్ అసిస్టెంటుగా పనిచేస్తున్నావు. తద్వారా దేశ ఆర్థిక సంపదను పెంచుతున్నావు. నీ ఉద్యోగం వల్ల ఒక రిక్షావాడు, ఒక పనిమనిషి, ఒక చీరల వ్యాపారి, ఒక కిరాణా షాపువాడు, ఒక స్వీటుషాపువాడు, ఒక ట్యూషన్ టీచరు - ఇంతమంది జీవితాలకు ఉపయోగపడుతున్నావు. కేవలం నీకుటుంబం అనుకుంటే ఎలాగ? పిల్లల కేముంది నువ్వు చెప్తేనేం, ట్యూషన్ టీచర్ చెప్తేనేం? ఇంట్లో జంతికలైతే నేం, కొన్న మిక్చరయితే నేం పెద్ద తేడా ఎముంది? నాకు మాత్రం

కష్టమేమిటి? ఆఫీసయ్యాక ఇంటికొచ్చి నువ్విచ్చిన కాఫీ తాగేవాణ్ణి. ఇప్పుడు ఆఫీసయ్యాక హోటల్లో కాఫీ తాగి, నిన్ను ఇంటికి తీసుకొస్తున్నాను. అంతేకదా. కేవలం కుటుంబ ఆదాయం చూసుకోకూడదు. దేశ సంపద మొత్తం చూసుకోవాలి. నీచదువు వృథా కావడం లేదు కదా. అది ఎంత తృప్తి. సంఘంలో నీ గౌరవం ఎంత పెరిగింది?"

సీతారాం మాటలు వింటున్న శారదకు అతను ఓదారుస్తూన్నాడో, వెక్కిరిస్తున్నాడో తెలియలేదు. తన ఉద్యోగం వల్ల లాభ నష్టాలు బేరీజు వేసుకొని రాజీనామా చేద్దామా అనుకుంటూ కూచుందామె.

(ఆంధ్రప్రభ వీక్లీ)